నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం | జూన్ 26, 2024 | www.navatelangana.com

7వ బెటాలియన్ కమాండెంట్‌గా రోహిణి ప్రియదర్శిని బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రోహిణి ప్రియదర్శిని

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 7వ బెటాలియన్ డిచ్‌పల్లి కి నూతన కమాండెంట్‌గా రోహిణి ప్రియదర్శిని మంగళవారం బాధ్యతలను ప్రస్తుత కమాండెంట్ రాంప్రకాష్ నుంచి మంగళ వారం స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని మాట్లాడుతూ ఎడవ బెటాలియన్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం ఎల్లప్పుడు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ కె.పి శరత్ కుమార్, కె.పి సత్యనారాయణ, ఆర్.ఐ లు, ఆర్‌యస్‌ఐలు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

పోచారం ప్రధాన కాలువ బ్రిడ్జ్‌పై రేలింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు

- నవతెలంగాణ ఎఫెక్ట్





నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం ప్రధాన కాలువపై చీనురు వాడి గ్రామాలకు వెళ్లే రహదారిపై నిర్మించిన బ్రిడ్జ్‌పై రేయిలింగ్ ఏర్పాటు చేయడానికి ఐదు లక్షల 50 వేలు మంజూరైనట్టు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మురళి గౌడ్, నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. గత పది రోజుల క్రితం సైడ్ వాల్ కూలడంతో ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి నిర్మాణం అనే కథనం నవతెలంగాణలో ప్రచురితమైంది. ఈ విషయంపై స్పందించిన సంబంధి శాఖ అధికారులు రైలింగ్ ఏర్పాటు చేయడానికి ఐదు లక్షల 50 వేలు మంజూరి చేయించినట్టు ఆయన తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయెుద్దు

- రాష్ట్రంలో ఎక్కడా లేని నిబంధనలు ఇక్కడ అమలు చేయెుద్దు
- కలెక్టరేట్ ఎదుట శాంతియుత నిరసనకు అనుమతించండి : సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వినతి



కలెక్టర్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కలెక్టరేట్ దగ్గర ధర్నాలను నిషేధించటం ప్రజల మనోభావాలను దెబ్బతీయటమే అవుతుందని సీపీఐ(ఎం) నాయకులు అన్నారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలను, నిరసన కార్యక్రమాలను నిషేధించి పాత ఎంపీడీవో ఆఫీసు స్థలంలో ధర్నా చౌక్ కొరకు స్థలాన్ని కేటాయించినట్లు, అక్కడే ప్రజలు తమ నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశానుసారం నిర్ణయించినట్టు జిల్లా పోలీసులు వామపక్ష పార్టీలకు, ప్రజా సంఘాలకు నోటీసులను అందజేయడం పట్ల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని అతిక్రమించిన నాయకుల పైన ,ప్రజల పైన ,కార్మికుల పైన కేసులను నమోదు చేయాలసి వస్తుందని హెచ్చరికలు జారీ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయటమే అవుతుందని అందువల్ల రాష్ట్రంలో ఎక్కడా లేని నిబంధనలను నిజామాబాద్ జిల్లాలో అమలు చేయటం సరైనది కాదని వాటిని ఎత్తివేయాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ ఏవోకు సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో తమ నిరసన వ్యక్తం చేయడం ప్రజల హక్కు అని రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని నిబంధనలు మన దగ్గర విధించటం సరైనది కాదని అన్నారు. దానికి తోడు ధర్నా చౌక్ కోసం కేటాయించిన స్థలంలో ముందుబాగంలో గోడలు ఉండటంతో పాటు ఎటువంటి కనీస సౌకర్యాలు లేకపోవడం ఆశతో వచ్చిన కార్మికులు, ప్రజలు ధర్నా నిర్వహించి వెనుదిరగడంతో నిరాశ చెందుతారని ఫలితంగా ప్రభుత్వాలపైన అసంతృప్తి పెరుగుతుందని అన్నారు. వచ్చిన కార్మికులకు సమస్య వినటానికి అధికారులు లేకపోవడం అసంతృప్తి పెరగటానికి కారణమవుతుందని అన్నారు. అందువల్ల అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించిన అనంతరం జిల్లా కలెక్టర్ గాని, అదనపు కలెక్టర్ గానీ ధర్నా చౌక్ వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకునేటట్టు అయితే ప్రజాభిప్రాయాన్ని గౌరవించిన వారు అవుతారని వారు తెలిపారు. అందువల్ల ఇప్పటికైనా ప్రజా సమస్యల పైన ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేసి వినతి పత్రం అందజేయటానికి జిల్లా కలెక్టరేట్ వద్దనే శాంతియుతంగా నిరసన చేపట్టేందుకు అవకాశం కల్పించాలని వారు కోరారు.

ఆర్గానిక్ పంటలకు డిమాండ్

- వరికి బదులు ఇతర పంటల సాగుపై దృష్టిసారించాలి
- రైతులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

ఆర్గానిక్ పంటలకు మంచి డిమాండ్ ఉందని, ఆ దిశగా పంటలు సాగు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రైతులకు సూచించారు. మార్కెటింగ్ అవకాశాల మేరకు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిపెట్టాలని సూచించారు. మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం దృశ్య మాధ్యమం కార్యక్రమంలో రైతు భరోసా, ప్రస్తుత వానాకాలం పంటలపై శాస్త్రవేత్తలతో సూచనలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా రైతులు ముందుకువచ్చి పంటలు సాగు చేయాలన్నారు. అన్నదాతకు ఆలంబనగా రాష్ట్ర ప్రభుత్వం రైతు నేస్తం ద్వారా రైతులకు అధిక దిగుబడులు సాధించడంలో మెళకువలు, సలహాలు, సూచనలు, సాంకేతిక ఉపకరణాల వినియోగంపై అవగాహన కలిగిస్తున్నదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఎడిఎ వీరాస్వామి, ఏ.ఓ. శ్రీకాంత్, ఏఈవో రాకేష్, తహశీల్దార్ రహిమోద్దీన్, ఎంపిడిఓ సాజిద్ అలీ, ఎఎంసి డైరెక్టర్ కపిల్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా రైతుభరోసా : మంత్రి తుమ్మల



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి

రైతు భరోసా కార్యక్రమం పటిష్టవంతంగా అమలు చేయడంపై విధివిధానాలు ఖరారు చేయుటకు రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. రైతు నేస్తం దృశ్య మాధ్యమం ద్వారా ముందుగా మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ ధనం వృథా కావద్దనే ఉద్దేశ్యంతో రైతు భరోసా కార్యక్రమం మరింత పకడ్బందీగా, సమర్థవంతంగా, జాగ్రత్తగా అమలుచేయుటకు ప్రభుత్వం రైతుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడంపై అందరి సూచనలు పరిగణలోకి తీసుకొని సబ్ కమిటీ తో చర్చించి జులై 15 లోగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. పలు జిల్లాల రైతు వేదికల నుంచి రైతులు 10 ఎకరాల వరకు రైతు భరోసాను అమలు చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారని అన్నారు. సామాజిక మాధ్యమాలలో వస్తున్న అపోహలను నమ్మవద్దని, రైతులకు పూర్తి న్యాయం చేకూరేవిధంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని మంత్రి తెలిపారు. ఎంత విస్తీర్ణం పంటలు పండిస్తే అంత విస్తీర్ణానికి రైతు భరోసా అందించాలని, పరిమితి విధిస్తే అంత లోపే పంటలు వేసే అవకాశముందన్నారు. అదేవిధంగా కౌలుదారులకు, రైతులకు రైతు భరోసాను సగం సగం అందించాలని, నిజంగా వ్యవసాయం చేస్తున్న అందరికి సకాలంలో రైతు భరోసా అందించాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ, వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తూ షరతులు లేకుండా రుణమాఫీ వర్తిపచేయాలని,వ్యవసాయ అనుబంధ పనులకు ఉపాధి హామి పనులను అనుసంధానం చేయాలని కోరారు. ప్రతి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలని, పాడిపరిశ్రమను ప్రోత్సహించాలని ఎర్రపహడ్ రైతు దేవిరెడ్డి విఠల్ రెడ్డి దృశ్య మాధ్యమం ద్వారా తెలిపారు.

రుణమాఫీకి అర్హులైన రైతులందరి వివరాలు అందజేయాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రుణమాఫీకి అర్హులైన రైతులందరి వివరాలు అందజేయాలని ఏ ఒక్క రైతు నష్టపోకుండా చూడాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు బ్యాంక్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎల్లారెడ్డిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. 2018 డిసెంబర్ నుండి 2023 వరకు నిర్ణిత కాల వ్యవధిలో 2 లక్షల రూపాయల లోపు పంట ఋణాలు తీసుకున అర్హులైన రైతులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సిండికేట్‌గా మారిన పాటదారులు

- బాన్సువాడ తైబజార్ వేలంలో లీలలు



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడ పురపాలక సంఘం పరిధిలో మంగళవారం అతిపెద్ద తై బజార్ వేలం జరిగింది. ఇందులో పాల్గొనే కాంట్రాక్టర్లు సిండికేట్ గా మారి అతి తక్కువ కోడ్ చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. మంగళవారం బాన్సువాడ మున్సిపల్ కార్యాలయం యందు డివిజన్ లోనే పెద్ద తైబజార్ వేలం పాటకు కాంట్రాక్టర్లను ఆహ్వానించారు. ఇట్టి తై బజార్ వేలం 9 నెలల వరకు మాత్రమే ఉంటుంది. 2025 మార్చి 31 వరకే కొనసాగుందని ముందుగానే స్పష్టం చేశారు. మేకల సంత రూ. 33.10 లక్షలు, రోజువారి సంత రూ. 7 లక్షలు, ప్రతి గురువారం నిర్వహించే వారం సంత రూ. 10.10 లక్షలకు కాంట్రాక్టర్లు పాట పాడి కైవసం చేసుకున్నారు. కాంట్రాక్టర్ లందరూ సిండికేట్‌గా మారి తక్కువ ధరకే వేలంపాట స్వాధీనం చేసుకోవడంపై స్థానికంగా అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా వేలంలో ధర పెరగకుండా వేలంలో పాల్గొన్న పాటదారులు సిండికేట్‌గా మారినట్టు సమాచారం. మేకల సంత వేలం 50 లక్షల ధర పలికే అవకాశం ఉన్నా.. తక్కువ జరిగినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వైస్ చైర్మన్ షేక్ జుబేర్, కమిషనర్ శ్రీహరి రాజు, పురపాలక సంఘం పాలకవర్గం సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- నీరు కలుషితం కానీయెుద్దు : డిఎంహెచ్‌ఓ తుకారం రాథోడ్



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నీరు కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డిఎంహెచ్‌ఓ తుకారాం రాథోడ్ అన్నారు. ప్రతి ఒక్కరికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసేలా చూడాలని, ప్రతి ఆరోగ్య సిబ్బంది రోజువారీగా డైరీను తమ వెంట ఉంచుకోవాలని తాము ఉదయం నుంచి సాయంత్రం వరకు చేసే పనులన్నీ దానిలో నమోదు చేయాలని ఎప్పుడైనా ఆకస్మికంగా తనిఖీలకు వచ్చినప్పుడు తమ దగ్గర ఉన్న డైరీలోనే ముందుగా చూస్తానని అన్నారు. మంగళవారం ఇందల్వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. తదనంతరం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తుకారం రాథోడ్ మాట్లాడుతూ అమ్మఒడి కార్యక్రమంను పకడ్బందీగా నిర్వహించాలని ప్రతి సోమవారం, మంగళవారం గర్భిణీ స్త్రీలకు ఉచిత రక్తపరీక్ష నిర్వహిస్తూ వైద్య నిపుణులచే పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు గ్రామాలలో హైపర్ టెన్షన్, డయాబెటిస్ రోగులను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టాలని, వారికి నెలకు సరిపడా మందులను సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పొగడ్బందీగా నిర్వహించాలని నీటి తొట్టెలలోనూ, మురికి నీటి నిలువలలోను, పూల కుండీలలోనూ, వాడి ప్రక్కన పెట్టిన కూలర్ల లోను తాగి పడేసిన కొబ్బరి బొండాలలోనూ వ్యర్థ పదార్థాలలో గల నీటి నిలువలను పూర్తిగా తొలగించాలని, సేప్టిక్ ట్యాంకులపై మూతలు ఉండేలా చూడాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. డెంగ్యూ వ్యాధి సోకే దోమలు మంచినీటిలోనే పెరుగుతాయని వాటి పట్ల అప్రమత్తగా ఉండాలని, ఫైలేరియా వ్యాధికి కారణమైన క్యూలెక్స్ దోమలు మురికినీటిలో పెరుగుతాయని, మురికి నీటిని తొలగించాలని ఆదేశించారు. కుక్క కాటు, పాము కాటు నివారణకు ఇంజక్షన్లు నిల్వ ఉంచుకోవాలని ఫార్మసిస్ట్ విజయలక్ష్మి కి ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వారికి వైద్య సేవలు అందజేయాలని విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరిం చారు. డిఎంహెచ్వో గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారి ఆస్పత్రికి రావడంతో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా పూలమాలలు శాలువలతో సన్మానించారు. అంతకుముందు ఆరోగ్య విస్తరణ అధికారి కవి వై శంకర్ డీఎంహెచ్వో తుకారం రాథోడ్ పై రాసిన కవిత్వాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఇందల్ వాయి ఆసుపత్రి వైద్యాధికారి సందీప్, జిల్లా అసంక్రమిత వ్యాధుల కోఆర్డినేటర్ వెంకటేష్, జిల్లా ఆరోగ్య విద్య బోధకులు వెంకటేశ్వర్లు, స్వామి సులోచన, సురేష్, నాగరాజ్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, వెంకట్ రెడ్డి, ఆనంద్ ఆరోగ్య సిబ్బంది, ఎం ఎల్ హెచ్ పి లు పాల్గొన్నారు.



తుకారాం రాథోడ్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

మార్గదర్శకాలు పాటిస్తే 21 రోజుల్లో లే అవుట్ పర్మిషన్

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

టీఎస్ బి పాస్ కింద ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి ఉన్న లే అవుట్ లకు 21 రోజులలోగా అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి లే అవుట్ కమిటీ సమావేశంలో సభ్యులనుద్దేశించి మాట్లాడుతూ సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిబంధనల మేరకు లే అవుట్ లు ఉన్నాయా? లేవా అని క్షేత్ర స్థాయిలో స్థాయిలో పరిశీలించి నిర్దారిత సమయంలోగా అనుమతులి వ్వాలన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీ లో 2 చొప్పున లే అవుట్ అనుమతులు పెండింగులో ఉన్నాయని అన్నారు. శుక్రవారం తిరిగి సమావేశమయ్యే నాటికి ప్రభుత్వ నిబంధనలు మేరకు లే అవుట్ లో అండర్ డ్రైనేజీ, విద్యుత్, సెప్టిక్ ట్యాంక్, ఇంకుడు గుంత, పచ్చదనం, 10 శాతం మార్టిగేజ్ వంటివి పొందుపరిచారా, వాటిని ఏర్పాటు చేస్తున్నారా పరిశీలించాలన్నారు. ప్రధానంగా రెవిన్యూ, నీటిపారుదల, పంచాయతీ రాజ్, రోడ్లు, భవనాలు, మునిసిపాలిటీ, విద్యుత్ శాఖలు తమ పరిధి లో వచ్చే అంశాలను పరిశీలించి వారం రోజులల్లో వివరాలను పొందుపరుస్తూ కలెక్టర్ లాగిన్ కు పంపాలని, అక్కడ పరిశీలించి తుది లే అవుట్ అనుమతికి మునిసిపల్ కమీషనర్‌కు పంపనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కామారెడ్డి ఆర్డీఓ రంగనాథ రావు, మునిసిపల్ కమీషనర్ సుజాత, ఆర్ అండ్ బి ఈఈ రవి శంకర్, జిల్లా నీటిపారుదల అధికారి నరసింహ రావు, విద్యుత్ శాఖ ఎస్ ఈ రమేష్ బాబు, కలెక్టరేట్ పర్యవేక్షకులు జ్యోతి తదితరులు పాల్గొన్నారు,

ఉపాధి కూలీలకు రోజువారి కూలీ రూ.600 చెల్లించాలి

- సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదు
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దివెంకట్రాములు



మాట్లాడుతున్న పెద్దివెంకట్‌రాములు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

'వ్యవసాయ కూలీలను ఏ ప్రభుత్వం వచ్చినా చిన్నచూపు చూస్తున్నది. తాపీ పని చేసే నైపుణ్యం లేని తాపి పనిచేసే వారికి కూడా రోజుకు 600 కూలి ఇస్తున్నారు కానీ, ప్రజల ఆకలిని తీర్చే వ్యవసాయ రంగంలో అహర్నిశలు పనిచేస్తూ పంటలు పండించడానికి దోహదపడుతున్న వ్యవసాయ కూలీలకు మాత్రం 200, 300 కంటే ఎక్కువ రావటం లేదని' తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దివెంకట్రాములు అన్నారు. ఉపాధి కూలీలకు రోజువారీ కనీస కూలీ రూ.600 అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 'వ్యవసాయ రంగంలో యంత్రాల రాకతో వ్యవసాయ కూలీలకు పని తగ్గింది. అందుకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తీవ్ర పోరాటాలు చేసి 2005లో ఉపాధి హామీ చట్టాన్ని సాధించుకుంది. ఈ చట్టంలో 60 నుంచి 150 రూపాయలు మాత్రమే రోజు కూలి పడుతుండటం గమనార్హం. ఎన్నికల అప్పుడు మాత్రం అనేక రకాలుగా హామీలు గుప్పిస్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం 25 వేల కోట్ల రూపాయల నిధులు బడ్జెట్ నుంచి తగ్గిస్తూ వస్తున్నది. మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉపాధి కూలీలకు రోజుకు 400 రూపాయలు ఇస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్న దానిని అమలు చేసే ఊసే లేదు. అందుకోసం రోజుకు 600 రూపాయలు ఇస్తూ 200 పని దినాలను పెంచాలని సంఘం డిమాండ్ చేస్తున్నది. అలాగే వ్యవసాయ పనులకు వెళుతున్న సందర్భంలో కూలీలకు కూడా రోజు కూలి ఆరు వందల రూపాయలు ఇవ్వాలని ఈ మేరకు ప్రభుత్వం జీవో ని విడుదల చేసి ఏ పనికి ఎంత అని లెక్కలతో కూడిన సూచిక పత్రాలని ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయంలో అంటేయాలని, చాటింపు వేయించి అమలు చేయాలని సంఘం ప్రభుత్వాలని డిమాండ్ చేస్తున్నది. ఉపాధి పని వ్యవసాయ పనులు ఏదైనా ప్రమాదానికి గురించే ఎక్సేసియా 20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాము. వ్యవసాయ కూలీల అభివృద్ధి ఉపాధి రంగంలో పనిచేస్తున్న వారి వేతనాల పెంపు ఇతర సౌకర్యాలు కోసం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం భవిష్యత్తులో కూడా మరిన్ని పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు' తెలిపారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే ఈ ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

రాష్ట్ర సమావేశాలు విజయవంతం

ఈ సందర్భంగా పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ... ఈనెల 23, 24 న స్థానిక జనార్దన్ గార్డెన్‌లో జరిగిన వ్యవసాయ కూలీల సెమినార్ కు హాజరై విజయవంతం చేసిన ఆహ్వాన సంఘానికి, వ్యవసాయ కార్మికులందరికీ, శ్రేయోభిలాషులందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర కమిటీ సమావేశానికి అన్ని రకాలుగా సహకరించిన వారందరికీ పేరుపేరున నిజామాబాద్ సంఘం జిల్లా కమిటీ ధన్యవాదాలు అని పెద్ది వెంకట్రాములు తెలిపారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి నాగుల గోవర్ధన్, జిల్లా ఉపాధ్యక్షురాలు గోశం లక్ష్మి పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

నవతెలంగాణ

తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి, సామాజిక స్పృహతో స్పందించే ఉత్సాహం.. అవినీతి, అక్రమాలను వెలికితీసే ధైర్యం, ప్రశ్నించేతత్వం, ప్రజాసమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా..? ఆ అవకాశాన్ని 'నవతెలంగాణ' కల్పిస్తోంది. ఖాళీ మండలాల్లో భర్తీకి ఆహ్వానిస్తోంది

ఖాళీ మండలాలు

నిజామాబాద్ జిల్లా

నిజామాబాద్‌టౌన్, వేల్పూర్, రుద్రూర్, ఆలూర్ డొంకేశ్వర్, బోధన్ టౌన్

కామారెడ్డి జిల్లా

కామారెడ్డి టౌన్, బాన్సువాడ, బీర్కూర్, బీబీపేట్, మాచారెడ్డి, పాల్వంచ

నవతెలంగాణ బుక్‌హౌజ్‌లో పనిచేసేందుకు ఇన్‌చార్జి కావలెను

అడ్రస్ : నవతెలంగాణ దినపత్రిక కార్యాలయం సుభాష్‌నగర్. ఎస్‌బిఐ పక్కన, నిజామాబాద్.

సంప్రదించాల్సిన నెంబర్లు : 9494573764, 9490099408

సకాలంలో వేతనాలు అందడం లేదు

నవతెలంగాణ-ఆర్మూర్



గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు వైద్యసేవలందిస్తున్న తమకు సకాలంలో వేతనాలు అందజేయాలని సంచార పశు వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాలోని సంచార పశువైద్య సిబ్బంది మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గానికి ఒక 1962 అంబులెన్స్ చొప్పున మూగజీవాలకు వైద్యసేవలు అందిస్తున్నామని అన్నారు. ఈ అంబులెన్స్‌లో వెటర్నరీ డాక్టర్, పారావేట్, డ్రైవర్, అటెండర్ విధులు నిర్వర్తిస్తుంటారన్నారు. గ్రామాల్లో పశువులకు వైదగ్యాసేవలందిస్తూ నిత్యం రైతులకు అందుబాటులో ఉంటున్నామని చెప్పారు. కొన్ని నెలలుగా తమకు సకాలంలో వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సంచార పశువైద్య సిబ్బంది కోరారు.

బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-ఏర్గట్ల



సన్మానించిన పలువురు

మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను, వ్యాయామ ఉపాధ్యాయురాలిని ఏర్గట్ల వాలీబాల్, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాలీబాల్,కబడ్డీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ...విద్యార్థులను ప్రతిభ వంతులుగా తీర్చిదిద్దే క్రమంలో మా గ్రామాన్ని ఎన్నుకున్నందుకు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. గ్రామస్థుల ప్రేమాభిమానాలకు ధన్యవాదాలని, విద్యార్థుల పురోగతికి మా వంతు కృషిచేస్తామని అన్నారు.

రూ.4లక్షల 37వేల ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



ఇన్సూరెన్స్ చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని గాంధీ నగర్ కాలనీకి చెందిన జరుపుల గంగు కుటుంబ సభ్యులకు రూ.4లక్షల 37వేల ఇన్సూరెన్స్ చెక్కు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి మంగళవారం అందజేశారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో సంవత్సరానికి రూ. 40వేల ప్రీమియం చెల్లించి పాలసీ తీసుకున్న జరుపుల గంగు ఇటీవల మృతి చెందారు. దీంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా క్లైమ్‌లో భాగంగా రూ.4లక్షల 37వేల చెక్కు మంజూరు అయ్యింది. ఈ చెక్కును నామిని అయిన జరుపుల గంగు కూతురు మాలోత్ సుజాతకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆర్మూర్ బ్రాంచ్ అభివృద్ధి అధికారి వుట్నూర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. జరుపుల గంగు తను కట్టిన ప్రీమియం సంవత్సరానికి రూ.30 వేలకే నామినీకి ఏకకాలంలో రూ.4లక్షల 37వేలు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏజీఎం సతీష్, డిఎం నగేష్, ఆర్మూర్ బ్రాంచ్ మేనేజర్ సందీప్, బ్రాంచ్ అధికారులు వుట్నూర్ రాజశేఖర్, మలవత్ సంతోష్, వుట్నూర్ రాజేష్, సల్లూరి గణేష్ గౌడ్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి పత్రీజి ధ్యాన తరగతులు



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యానమహ శక్తి క్షేత్రం, పీఎంసి వారి ఆధ్వర్యంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజులపాటు పత్రీజీ ధ్యాన మహాయజ్ఞం ధ్యాన ఆత్మ జ్ఞాన కార్యక్రమాన్ని పట్టణంలోని పెర్కిట్ శ్రావణ్ కన్వెన్షన్ నందు నిర్వహించనున్నట్టు పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయికృష్ణా రెడ్డి, సిద్దేశ్వర పిరమిడ్ చైర్మన్ ఏనుగు తిరుమల గంగారాం, కోశాధికారి నల్ల గంగారెడ్డి తెలిపారు. మూడు రోజులపాటు జరిగే కార్యక్రమానికి ఉచిత వసతితో పాటు భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతిరోజు ధ్యానం గురువుల, పిరమిడ్ మాస్టర్ల సందేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పిరమిడ్ మాస్టర్ల అనుభవాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహా శక్తి క్షేత్రం గౌరవ కమిటీ సభ్యులు కూనింటి శేఖర్ రెడ్డి, బొడ్డు దయానంద్, పెంబర్తి నారాయణ, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ నిర్మాణంకోసం స్థలం పరిశీలన



పిచికారి చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ చేంగల్ గ్రామంలోని స్వచ్ భారత్ మిషన్‌లో భాగంగా కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ నిర్మాణం కోసం స్థల పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పురోగతి పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా పంచాయతీ కార్యదర్శితో గ్రామ పారిశుధ్యంపై సమీక్షించారు. బడా భీంగల్ గ్రామంలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ నిర్మాణం కోసం స్థల పరిశీలించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేని వారి కొరకు జరుగుతున్న సర్వే వివరాలను పంచాయతీ కార్యదర్శులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గంగా మోహన్, ఏపీవో నర్సయ్య, టెక్నికల్ అసిస్టెంట్ గణేష్, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్షల రీవాల్యుషన్‌కు షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పి జి ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షల రీవాల్యుషన్ కు షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. యూనివర్సిటీ పరిధిలోని పిజి ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు యూనివర్సిటీ పరీక్షల విభాగం రీకౌంటింగ్ తేదీని ప్రకటించింది. జూలై లోపు రీ కౌంటింగ్ కోరిన విద్యార్థులు ఫీజు చెల్లించాలని తెలిపారు. ఒక్కొక పేపర్ రివాల్యుయేషన్ రూ.500 చెల్లించాలని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ తెలిపారు.

ఆ పాఠశాలకు ప్రభుత్వ అధికారులే అండ

- భారీగా ముడుపులు
- అందడంతోనే చర్యలు శూన్యం?

నవతెలంగాణ-నందిపేట్



కొనసాగుతున్న ధృవ స్కూల్ బిల్డింగ్ పనులు

మండల కేంద్రంలో అనుమతులు ఓ చోట.. అడ్మిషన్లు మరోచోట చేపడుతున్న ధృవ ప్రైవేట్ స్కూల్‌కు మండల సంబంధిత ప్రభుత్వ అధికారులే అండగా నిలుస్తున్నారన్న అనుమానం వ్యక్తం అవుతుంది. పాఠశాలలు ప్రారంభమైన పది రోజుల లోపే సుమారు 20లోపు అడ్మిషన్లు చేసి విద్యార్థులను ఉమ్మెడ పాఠశాలకు పంపిస్తున్న పాఠ్యపుస్తకాలు అమ్మిన విద్యాశాఖ అధికారులకు మాత్రం కనబడడం లేదు. దీంతోపాటు గ్రామ పంచాయతీ నుంచి ఇంటి నిర్మాణం కొరకు అనుమతి తీసుకొని కమర్షియల్‌గా స్కూల్ భవనంగా మార్చి పనులు చేపడుతున్న మండల పంచాయతీ అధికారులుకు మాత్రం కనబడటం లేదనేది పలు అనుమానాలకు తావిస్తోంది.

అధికారులకు భారీ ముడుపులు !

ఆ పాఠశాలను నడిపేందుకు ఇప్పుడున్న కార్యదర్శి కంటే ముందు పనిచేసిన గ్రామ పంచాయతీ సెక్రెటరీకి, మండల విద్యాశాఖ అధికారులకు బాగానే ముడుపులు ముట్టినట్లు మండలంలో తీవ్ర చర్చ జరుగుతోంది. పత్రికలో కథనం వచ్చిన అటువైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడం, తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడం అవుననే సమాధానం వస్తోంది. సామాన్యులు ఏదైనా అనుమతి కొరకు పంచాయతీకి వెళ్లిన అదేవిధంగా పాఠశాల అనుమతి కొరకు సవాలక్ష కారణాలు చెప్పే అధికారులు ఇంత తతంగం జరుగుతున్న, తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్న ఆ కొత్త స్కూల్ భవనంపై మాత్రం మౌనం పాటిస్తున్నారు. కమర్షియల్‌గా వాడుకున్నట్లయితే ఖచ్చితంగా డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డిటిసిపి) సంబంధిత కార్యాలయం నుంచి అనుమతి పొందాలని తెలిపారు. అటు విద్యాశాఖ అధికారులు కూడా బిల్డింగ్ పూర్తయ్యే వరకు ఎలాంటి అడ్మిషన్లు, ఎలాంటి విద్యా బోధన చేయకూడదని కామన్‌గా మందలించి వదిలేసినట్లు తెలిసింది. ఆ ధృవ పాఠశాల యజమాని మాత్రం ఏం చేసుకుంటారో చేసుకోని ఏమైతదో కానీ అని బిల్డింగ్ పనులను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని లోతుగా విచారణ చేపట్టి ప్రైవేట్ ధృవ స్కూల్‌పై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



డీఈవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

అనుమతులు లేని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల పేర్లు బహిర్గతం చేయాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. నిజామబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాల దోపిడిని అరికట్టాలని మంగళవారం పిడిఎస్యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వి దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియమించకుండా విద్యార్థుల సంఖ్య ఎలా పెరుగుతుందన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలకు అనుమతులు లేకుండా, సౌకర్యాలు లేకుండా, క్వాలిఫికేషన్ లేని టీచర్ల విద్యాబోధన చెప్తున్నా జిల్లా అధికారులు నిమ్మకునీరెత్తి నట్లు ఉండడం సిగ్గుచేటన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో పుస్తకాలమ్ముతున్న, ఇష్టం వచ్చిన రీతులుగా ఫీజులు వసూలు చేస్తున్నా జిల్లా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో పేరెంట్స్ కమిటీలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులను డిస్ప్లే చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. అనుమతులు లేని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల పేర్లను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న ప్రతీ సమస్యను పరిష్కరించి ప్రైవేటు, కార్పొరేట్ దోపిడి నియంత్రణకి ముందుండాల్సిందిగా కోరారు. జిల్లాలో కిడ్స్ పాఠశాలలు, ప్లే పాఠశాలలు విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థి ఉద్యమాలు ఉధృతం అవుతాయని, జరిగే పరిణామాలకు జిల్లా విద్యాధికారులు, ప్రభుత్వం బాధ్యత వహించాల్సిందిగా హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కె. అషుర్, జిల్లా సహాయ కార్యదర్శి బి. చందు, జిల్లా కోశాధికారి నిఖిల్, జిల్లా నాయకులు మహిపాల్, మమత, జంపన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు సమగ్రమైన చట్టం తేవాలి

- రూ.12 వేల పెన్షన్‌ను అమలు చేయాలి
- ఏఐపీకేఎంఎస్ వినతి

నవతెలంగాణ-సిరికొండ



వినతి పత్రాన్ని అందజేస్తున్న ఏఐపీకేఎంఎస్ నాయకులు

కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఉపాధిలేకుండా చేసి కూలీల పొట్ట కొడ్తున్నదని, వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం సమగ్రమైన చట్టము తేవాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) జిల్లానాయకులు రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సిరికొండలో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తదనంతరం తహసీల్దార్ కు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో14 కోట్ల మంది వ్యవసాయ కార్మికులే ఉన్నారని అన్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ జరగడంతో ఉపాధి కోల్పోయి దిక్కుతోచని అయోమయమైన పరిస్థితిలో కొట్టుమిట్టాడు తున్నారని తెలిపారు. ప్రధాని మోడీ ఉపాధిహామీ పథకానికి నిధుల్లో కోత విధించడంతో వ్యవసాయ కార్మికుల పరిస్థితి మరింత గడ్డు పరిస్థితుల్లోకి నెట్టబడిందన్నారు. ధరలకను గుణంగా 600 రూపాయల కూలిని పెంచాలని ఆందోళనలు నిర్వహించిన భారత ప్రధాని మోడీకి చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లు ఉందని తెలిపారు. కార్పొరేట్లకు పదేళ్లలో 30 కోట్ల రుణాలు మాపి చేశారని, రెక్కలు తప్ప ఆస్తులు లేని వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి పూనుకోకుండా ఎగనామం పెట్టారన్నారు. 50 సంవత్సరాలు పైబడిన వారికి నెలకు పదివేల రూపాయలు చొప్పున పెన్షన్ అందించాలని, అన్ని రకాల రోగాలకు వర్తించే హెల్త్ కార్డు అందించి ఇండ్ల నిర్మాణానికి స్థలం కేటాయించి 10 లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ కూలీల్లో అధిక భాగం మహిళలేనని కూలీ పనుల్లో, వేతనాలు చెల్లింపుల్లో వివక్షత తప్పడం లేదని అన్నారు. వ్యవసాయకార్మికులకు సంవత్సరానికి 12వేల జీవనభృతి దేనికి సరిపోదని, బీడీ కార్మికులకు, గీతా కార్మికులకు, ఇస్తున్నట్టుగా నెలకు 2016 రూపాయలు ఇవ్వాలని, బీడీ,గీతా కార్మికులకు ఎన్నికల సందర్భంగా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నాలుగు వేలను వ్యవసాయ కార్మికులకు వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సాయరెడ్డి, కిషోర్, మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదరి రమేష్, డివిజన్ నాయకులు దామోదర్, మండల నాయకులు లింబాద్రి, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం. మండల నాయకులు పాల్గొన్నారు.

సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ తెరిపించి నడిపించండి

- రైతునాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మూతపడిన సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించి నడిపించాలని రైతు నాయకులు డిమాండ్ చేశారు. గత పాలకుల తప్పుడు విధానాలు, అధికారుల నిర్లక్ష్య మూలంగా మూత పడిన సారంగాపూర్ చక్కర ఫ్యాక్టరీని (ఎన్‌సిఎఫ్‌సి) తెరిపించి ప్రభుత్వమే నడిపించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, చెరుకు ఉత్పత్తి దారుల సంఘం నాయకులు మచర్ల నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జాలాల్ పూర్ గ్రామంలో రైతులను కలిసి మాట్లాడారు. సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ నడిచిన రోజుల్లో రైతులకు కార్మికులకు సంతోషంగా ఉన్నారని, పిల్లల చదువులు, పెండ్లిళ్లు, ఇండ్లు కట్టుకున్న రోజులన్నాయని వారు అన్నారని తెలిపారు. ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలు చక్కర పాలసీల మూలంగా జిల్లాలో గల రెండు చక్కర ఫ్యాక్టరీలు మూలకు పడ్డాయాని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చక్కెర ఫ్యాక్టరీలు తెరిపిస్తామని, అందులో భాగంగా సబ్ కమిటీ వేశారని, ఆ సబ్ కమిటీలో ఎన్‌సీఎస్ఎఫ్ లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సబ్ కమిటీలో ఎన్‌సిఎస్ఎఫ్‌ను చేర్చి ప్రభుత్వమే నడపాలని వారు డిమాండ్ చేశారు. ఆ వెలుగులో రైతులను చైతన్య పరిచే కార్యక్రమంలో భాగంగా ఫ్యాక్టరీ పరిధిలోని గ్రామంలో రైతులతో సమావేశాలు జరుపతున్నామని అన్నారు. చెరుకు పంట పండించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వం ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫ్యాక్టరీని తెరిపిస్తానని భరోసా కల్పించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఇప్పటికైనా వెంటనే చెరుకు ఫ్యాక్టరీని తెరిపించేందుకు తగిన విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు కృష్ణ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రాములు, అశోక్, రాజకుమార్, సాయినాథ్,అష్మా బేగం, గంగామణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు నాయకులు



వేములకు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు

అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన వేముల

- ఘన స్వాగతం పలికిన బిఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అమెరికా పర్యటన ముగించుకుని స్వదేశానికి సోమవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చారు. విమానాశ్రయంలో బీఆర్ ఎస్ బాల్కొండ మండల నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ పార్టీ బాల్కొండ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వై. లింగా గౌడ్, శ్రీకాంత్ యాదవ్, సూరజ్ రెడ్డి, షేక్ వహాబ్, సయ్యద్ మజారొద్దీన్, కన్న పోశెట్టి, షేక్ రహీమోద్దీన్, ఈపి నారాయణ, సయ్యద్ ఫయాజ్, సయ్యద్ ఇఫ్తేఖార్, హాస్టల్ రియాజ్ తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లి : మంత్రి ప్రశాంత్‌రెడ్డికి స్వాగతం పలికిన వారిలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, పెరుమండ్ల రాజా గౌడ్, మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కాలేరు శేఖర్, ఎంపీటీసీ సభ్యులు మైలారం సుధాకర్, లకావత్ గంగాధర్, కోనాపూర్ సింగిల్ విండో చైర్మన్ బడాల రమేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలావత్ ప్రకాష్, మాజీ సర్పంచులు పెండే ప్రభాకర్, నునావత్ లస్కర్, నాయకులు రేంజర్ల మహేందర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమస్య పరిష్కారానికి సామరస్యంగా కృషిచేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలోని కొన్ని విద్యార్థి సంఘాలు ఈ మధ్య కాలంలో కొన్ని ప్రైవెట్ స్కూల్స్, ప్రైవేటు కళాశాలలకు సం బంధించి క్యాంపస్ లోకి ప్రవేశించి యాజమాన్యాలతో గొడవకు దిగి, భయభ్రాంతులకు గురి చేస్తు వారి విధులను అడ్డుకుంటున్నట్టు మా దృష్టికి వచ్చిందని నిజామాబాద్ పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ ఒక ప్రకటన లో తెలిపారు. విద్యకు సంబంధించి ఎలాంటి సమస్యలున్న ముందుస్తుగా జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి లేదా జిల్లా పరిపాలన అధికారి దృష్టికి తీసుకొని వెళ్లాలని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి సామరస్యంగా కృషిచేయాలి తప్ప, స్కూళ్లకు లేదా కాలేజీలకు వెళ్లి దాడులు నిర్వహించిన, బంద్ చేయించిన, యాజమాన్యాలను భయభ్రాంతులకు గురిచేసిన వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈవిషయమై జిల్లాలోని అన్ని డివిజన్ స్థాయి అధికారులకు, సర్కిల్ ఇన్ స్పెక్టర్లకు, ఎస్‌హెచ్‌ఓలకు, ఎస్ఐలకు ఆదేశాలు జారీచేయడం జరిగిందని పేర్కొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక వేలం

నవతెలంగాణ-ఏర్గట్ల

తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 26న ఇసుకను వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్ మంగళశారం తెలిపారు. బట్టాపూర్ గ్రామంలో ఊర గుట్ట వద్ద 50 ట్రాక్టర్ ట్రిప్పుల అక్రమ ఇసుక నిల్వలను గుర్తించి పట్టుకున్నామని పేర్కొన్నారు. పై అధికారుల ఆదేశాల మేరకు ఇసుకను వేలం వేస్తున్నామని, ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చుని తెలిపారు.

కేంద్ర మంత్రులను సన్మానించిన కోటపాటి



బండిసంజయ్‌ను సన్మానిస్తున్న కోటపాటి

నవతెలంగాణ-ఆర్మూర్

రైతు నాయకుడు, బిజెపి సీనియర్ నాయకులు కోటపాటి నరసింహం నాయుడు రెండు రోజులుగా ఢిల్లీలో పర్యటించి కేంద్ర మంత్రులు బండి సంజయ్, ధర్మేంద్ర ప్రదాన్‌లను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రులుగా నియమింపబడ్డ సందర్భంగా ఘనంగా సన్మానించారు ఒడిస్సా లోని సంబల్ పూర్ నుండి భారీ మెజారిటీతో గెలిచి రెండవసారి కేంద్ర విద్యా శాఖ మంత్రిగా నియమించిన ధర్మేంద్ర ప్రదాన్ ను ఆయన నివాసంలో కలిసి అభినందించారు. కోటపాటి తన ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఒడిస్సా లోని తెలుగు ఓటర్లను ప్రభావితం చేసినందుకు కోటపాటికి ధర్మేంద్ర ప్రదాన్ ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఢిల్లీ లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి, అభినందించారు. ఎన్నో కేసులు, అవమానాలు ఎదుర్కొని భారీ మెజార్టీ తో కరీంనగర్ నుండి గెలవడమే కాక రాష్ట్రంలో పార్టీ బలోపేతం కు పాటుపడిన సంజయ్ కృషిని మెచ్చి కేంద్ర సహాయ మంత్రి హెూదా ఇచ్చిన అధిస్థానానికి కోటపాటి ధన్యవాదాలు తెలిపారు. ఈ పర్యటనలో ఈటెల రాజేందర్, ధర్మపురి అరవింద్, జాతీయ నాయకులు మురళీధర్ రావులను కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. కోటపాటి వెంట బాలయ్య న్యాయవాది , గుండా వీరయ్య ఉన్నారు.

బడపహాడ్ దర్గా హుండీ ఆదాయం రూ.20,90,700

నవతెలంగాణ-వర్ని



మండలంలోని బడాపహాడ్ (పెద్దగుట్ట) సయ్యద్ షాదుల బాబా దర్గా హుండీని వక్ఫ్‌బోర్డు అధికారులు సోమవారం లేక్కించారు. వక్ఫ్‌బోర్డు వారి ఆధ్వర్యంలో గత రెండు నెలల నుంచి కొనసాగుతున్నది. ప్రభుత్వం అధికారికంగా దర్గా వద్దకు మొక్కులు చెల్లించుకొనే భక్తుల నుంచి రెండు నెలల హుండీ ఆదాయం రూ.20,90,700 వచ్చినట్లు వక్ఫ్‌బోర్డు అధికారులు మంగళవారం వెల్లడించారు. గతంలో కాంట్రాక్టర్ల ఆధీనంలో కొనసాగుతుండేది. కాంట్రాక్టర్లు పోయిన తరువాత వక్ఫ్‌బోర్డు అధికారులు సమక్షంలో దర్గా కొనసాగగా ఆదాయం చేకూరినట్లు వక్ఫ్‌బోర్డు అధికారులు తెలిపారు.

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ-సదాశివనగర్

కళాశాల పూర్వ విద్యార్థులను ఆహ్వానించి కళాశాల కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో ఆలిమినీ మీట్, గ్రాడ్యుయేషన్ డేను విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాధిక అధ్యక్షత వహించారు. కళాశాల పూర్వ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన పి.జనార్ధన్‌రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామారెడ్డి రిటైర్డ్ లెక్చరర్ ఎం.వీరయ్య ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులు ఉద్దేశించి ప్రసంగించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించి సమాజానికి సేవచేయాలని ఆకాంక్షించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.రేణుక, అకాడమిక్ కోఆర్డినేటర్ కె.వనజ, కల్చరల్ కోఆర్డినేటర్ ఆర్.ఉదయనితో పాటు అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని మజీద్‌లో స్థానిక ఎంపీటీసీ తూర్పురాజులు ఎంపటిసి నిధుల నుంచి సుమారు రూ.2లక్షల నిధులతో మసీదులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ రాధ బలరాం, జెడ్పీటీసీ శంకర్ నాయక్, ఎంపీపీ రాధా బలరామ్, ఎంపిటిసి తూర్పు రాజులు స్థానిక నాయకులతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి తూర్పు రాజులు మాట్లాడుతూ గాంధారిలో ప్రధానంగా 2 కిలోమీటర్ల రోడ్డు, సంగెం రేవు బ్రిడ్జి, పోచమ్మ గుడిరోడ్డు పనులు ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆశీస్సులతో అతి తొందరలో ప్రారంభించుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ సాయికుమార్, తాజా మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, ఎంపిటిసి పత్తి శ్రీనివాస్, నాయకులు తాడ్వాయి సంతోష్, బెజగం సంతోష్, లైన్ రమేష్, ముస్తప్ప, సంగని బాబా, నీలా రవి, గడ శంకర్, బొమ్మని బాలయ్య, బాగ్యా నాయక్, వినయ్, విఠల్, బషీర్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మజీద్ కమిటీ మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- భారతీయ విద్యార్థి మోర్చా



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

నిబంధనలు పాటించని కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని భారతీయ విద్యార్థి మోర్చా ఇంచార్జి పెరుమాండ్ల బుల్లెట్ చక్రవర్తి తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ పుస్తకాలను అమ్ముతూ సరైన వసతులు లేకున్నా పాఠశాలలను నడుపుతున్నారని తెలిపారు. విద్యను వ్యాపారం చేస్తున్నారన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించిన కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలలకు వత్తాసు పలుకుతూ ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తున్నారన్నారు. నిబంధనను పాటించని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, మోహన్ తదితరలు పాల్గొన్నారు.

తైబజార్ వేలం వాయిదా

- తిరిగి 27న నిర్వహణ




వేలం పాటలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం తైబజార్ వేలంలో భాగంగా వారపు సంత, మేకల సంత, రోజువారి సంత, మస్లాకల కొరకు వేలంవేశారు. ఇద్దరు మాత్రమే వారపు సంత వేలం పాట పాడారు. దీని కొరకు వ్యక్తిగతంగా రూ.50,000 డిపాజిట్ చేసి, 1,50,000 రూపాయల వరకు మాత్రమే పాడి నిష్క్రమించారు. మిగతా వేలం పాటలకుగాను ఎవరూ ముందుకు రానందున గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి మారుతి (ఎంపిఓ), గ్రామ పంచాయతీ సెక్రటరీ చంద్రకాంత్ వేలం పాటను గురువారం వరకు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ 'తై బజార్ వేలం పాట'ను 27న ఉదయం 11గంటలకు నిర్వహిస్తామని తెలిపారు.

ప్రజా పాలన దరఖాస్తుల కోసం బారులు



మండల పరిషత్ కార్యాలయం ముందు లబ్దిదారులు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకుని పథకాలు అమలు కాని కుటుంబాలు సమస్యలు పరిష్కరించాలని బారులు తీరారు. జీరో కరెంటు బిల్లు, 500 సబ్సిడీ గ్యాస్ కోసం ప్రజలు బారులు తీరారు. ప్రతిరోజు ఉదయం 10లోపు తమ దరఖాస్తు ఫారాలను తీసుకుని మండల పరిషత్ కార్యాలయానికి వస్తున్నారు.

జోరుగా ఇసుక తవ్వకాలు

- మంజీరా, గోదావరి నదుల్లో నుంచి..
- సమీపంలోనే డంపింగ్
- ఇతర ప్రాంతాలకు తరలింపు

నవతెలంగాణ-రెంజల్



గ్రామ సమీపంలో ఇసుక డంప్‌లు

మండలంలో అక్రమ ఇసుక రవాణా జోరుగా కొనసాగుతోంది. మండలంలోని కందకుర్తి సమీపంలోని మంజీరా, గోదావరి నదుల్లో నుంచి ఇసుకను తరలిస్తూ.. ఆ నదులకు సమీపంలోనే డంప్ చేస్తున్నారు అక్రమార్కులు. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

సోమవారం బోర్గం గ్రామంలో సుమారు వేయి ట్రాక్టర్ల అక్రమ ఇసుక నిల్వలను తహసీల్దార్ సీజ్ చేసిన విషయం తెలిసిందే. మండలంలోని పలు గ్రామాలలో ఇసుకను మాఫియా యథేచ్ఛగా డంప్ చేస్తోంది. ఇక డంప్ చేసిన ఇసుకను అధికారులు సీజ్ చేస్తే.. వారే ఆ ఇసుకను తక్కువ రేటుకు కొనుగోలు చేయడం ఆనవాయితీగా మారింది. ఇసుక మాఫియాకు పరోక్షంగా అధికారులే ఊతమిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. మండల స్థాయి అధికారులకు కార్యాలయం పనులలో నిమగ్నం అవ్వడం అక్రమార్కులకు అవకాశంగా మారింది. ఇటీవల ఎడపల్లి ఎస్సై ఎలాంటి అనుమతి పత్రాలు లేని మూడు ఇసుక టిప్పర్లను జాన్కంపేట్ సమీపంలో స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. డివిజన్, జిల్లాస్థాయి అధికారులు అక్రమ ఇసుక నిల్వలపై ప్రత్యేక దృష్టి సారిస్తే అక్రమ ఇసుక రవాణాను అరికట్టవచ్చని ప్రజలు అంటున్నారు.

రుణమాఫీ ప్రకటన పట్ల హర్షం

నవతెలంగాణ-ఎడపల్లి/జుక్కల్



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రైతులు తీసుకున్న బ్యాంకు రుణాల రెండు లక్షల రుణాలు మాఫీ చేస్తామని క్యాబినెట్లో సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ మంత్రులు ఆమోదించడం పట్ల ఎడపల్లి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మంగళవారం పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పులి శ్రీనివాసరావు మాట్లాడారు. ఏకకాలంలో రైతులకు రెండులక్షల రుణమాఫీ చేయడం హర్షనీయమన్నారు. గత ప్రభుత్వాలు చేయని రుణమాఫీని తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు ఇచ్చిన హామీను అమలు చేయడం సంతోషనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈరంటీ లింగం, మండల కోశాధికారి బొబ్బిలి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు బంజ కామప్ప, ఎడపల్లి, జైతాపూర్ సహకార సంఘాల అధ్యక్షులు పోల మల్కారెడ్డి, కరటూరి సత్యనారాయణ, ఎడపల్లి మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు, నాయకులు మచ్చూరి గంగాధర్, ఇరెండ్ల నవీన్, రత్నాకర్‌రెడ్డి, కిసాన్ కేత్ మండలాధ్యక్షుడు శివరామ ప్రసాద్, ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : ప్రభుత్వం రైతులకు రెండులక్షల రూపాయల రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించడంతో రైతులు మంగళవారం సాలూర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి బోధన్, సాలురా మండలాల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మంధర్నా రవి, రమేష్, సొసైటీ చైర్మన్ జనార్దన్, కేజీ గంగారాం, చీల శంకర్, బీహారి హన్మాంత్రావ్, భూయ్యన్ సురేష్, సోక్కం రవి, ఛిద్రపు అనిల్, ఛిద్రపు రాములు, కుమ్మన్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి, రావుల లక్ష్మణ్, రైతులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రైతుల పక్షపాతి

నవతెలంగాణ-ఎడపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పథకాన్ని తప్పకుండా అమలు చేస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన రైతునేస్తం రైతుభరోసా కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గంలోని ఎడపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతునేస్తం రైతుభరోసా వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నియోజకవర్గ పరిధిలోని మండలానికి ఒక రైతు చొప్పున వ్యవ సాయంపై సలహాలు సూచనలను అడిగి తెలుసుకున్నారు. రైతుల అభిప్రాయాలను సేకరించిన అనంతరం రైతుభరోసా పథకాన్ని తమ ప్రభుత్వం పక్కగా అమలు చేస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు భరోసా ఇచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. తమ ప్రభుత్వం అ రైతుల పక్షపాతి అని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి పంటలపై అవగాహన, సలహాలు సూచనలను అందజేయాలన్నారు. రైతు భరోసా పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆమోదించిన అనంతరం కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, అధినేత రాహుల్‌గాంధీతో మంత్రివర్గంతో పాటు ఎమ్మెల్యేలు చర్చించి అనంతరం ఆమోదం పొందేందుకు చర్చించనున్నట్లు ఆయన అన్నారు. ఏది ఏమైనా తమ ప్రభుత్వ హాయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతులకు అండగా తమ ప్రభుత్వం ఉంటుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నిజామాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (ఏడీఏ) వాజిద్ హుస్సేన్, ఎడపల్లి, కోటగిరి, మండల వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధి రామేశ్వరరావు, శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారులు జ్యోతి, సప్తగిరి, ఎడపల్లి, జైతాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు పోల మల్కా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు

ట్రాఫిక్ సమస్య తలెత్తొద్దు

- అందుకు చిరువ్యాపారులు సహకరించాలి
- మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు చిరు వ్యాపారస్తులు రోడ్డు మీద ఉండకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి పట్టణంలోని డైలీ మార్కెట్, సుభాష్‌రోడ్‌లను మున్సి పల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సుభాష్‌రోడ్‌లో ఉన్న ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు మున్సిపాలిటీ చర్యలు చేపడుతుందన్నారు.

ప్రజలు ఇబ్బందుల పాలు కాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని చిరు వ్యాపారులకు కాలి స్థలాలలో పెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లు ముప్పారపు ఆనంద్, పాత శివ కృష్ణమూర్తి, పంపరి శీను, ప్రసన్న, రాజునాయక్, అంజన్‌రెడ్డి మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



వ్యాపారులకు సూచనలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నెంబర్ ప్లేట్‌లేని వాహనాలు సీజ్



సీజ్ చేసిన వాహనాలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసినట్టు ఎల్లారెడ్డి డి.ఎస్.పి శ్రీనివాసులు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశానుసారం ఎల్లారెడ్డి సబ్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన ఎస్ఐలతో మండలంలోని ఆయా గ్రామాలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా ఇందులో 25 వాహనాల్లో నెంబర్ ప్లేట్లు లేకపోవడంతో వాటిని సీజ్‌చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉంచినట్టు వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా 13 మందిపై కేసు నమోదు చేశామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి, ఎల్లారెడ్డి, సదాశివనగర్, నాగిరెడ్డిపేట్, గాంధారి ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలన



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-భిక్కనూర్/రెంజల్

మండలంలోని కాచాపూర్ గ్రామంలో పాఠశాలలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పనులను జిల్లా అదనపు కలెక్టర్, డిఆర్డిఓ చందర్ మంగళవారం పరిశీలించారు. అమ్మ ఆదర్శ పనులను త్వరగా పూర్తి చేయాలని, పాఠశాల ఆవరణలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏఈపిఆర్ సోహెల్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, ఎంఈఓ ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి మౌనిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ మండల కేంద్రంలోని శివాలయం వద్దనున్న ఎంపీపీఎస్ పాఠశాల, దండిగుట్ట గ్రామంలోని ఎంపీఎ ఎస్ పాఠశాలలను ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక కాంట్రాక్టర్లను ఆదేశించారు. పాఠశాలలు పున్ణ ప్రారంభమైనందున వేగవంతంగా పనులను పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తికాగానే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట కార్యదర్శి గౌతమి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశు వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న జడ్పీటీసీ తిరుమలగౌడ్

నవతెలంగాణ-దోమకొండ

పశు వైద్యాధికారులు అందుబాటులో ఉండాలని జడ్పిటిసి సభ్యుడు తీగల తిరుమలగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పశవైద్య కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమకొండ మండల కేంద్రంలోని పశువైద్యశాలను రైతులతో కలిసి పరిశీలించామని, మేకలకు, గేదెలకు, పశువులకు వైద్యం అందించడం లేదని, పశు వైద్యులు విధులకు రావడం లేదని రైతులు జెడ్పిటిసి దృష్టికి తీసుకురావడతో పశువైద్య కార్యాలయాన్ని పరిశీలించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోగా రెండు మూడు రోజుల్లో వైద్యులను అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు జడ్పిటిసి తీర్మల్‌గౌడ్ తెలిపారు. ఆయన వెంట ఆలయ కమిటీ అధ్యక్షుడు అబ్రబోయిన రాజు, నాయకులు మధు, స్వామి రైతులు ఉన్నారు.

17వ వార్డులో నూతన బోరు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

అశోక్‌నగర్ 17 వార్డులో నూతన బోరు మోటర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్ 17వ వార్డులోని హనుమాన్ టెంపుల్ చుట్టుపక్కల ఉన్న ప్రజలకు నీటికి ఇబ్బంది కావడంతో బోరును వేసి మూట బిగించినట్టు కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని, తాగునీటి సమస్యను పరిష్కరించనున్నట్టు వివరించారు. అవసరమైతే ట్యాంకర్లు పంపించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్ అవధూత నరేందర్, మాజీ కౌన్సిలర్ సుధాకర్, పాత శివ కృష్ణమూర్తి, వనిత రామ్మోహన్, చాట్ల వంశీ పాల్గొన్నారు.

తోపుడుబండ్ల వితరణ


తోపుడుబండ్లు అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీక్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో 5 తోపుడు బండ్లను రెండవ సారి మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పట్వారీ గోపికృష్ణ మాట్లాడుతూ.. చిన్న వీధి వ్యాపారం వారికి ఇవి ఎంతో ఉపయోగం అని అన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ చైర్మన్ పిడిజి హనుమంత్ రెడ్డి , కాంతి గంగారెడ్డి, కార్యదర్శి పట్వారీ తులసి కోశాధికారి లక్ష్మీనారాయణ పుష్కర్ రావు, చరణ్ రెడ్డి, చెలిమెల రాజేందర్, గోనె దామోదర్, శశిధర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సింగంపల్లి జీపీ రికార్డులు తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని సింగంపల్లి గ్రామపంచాయతీలో గల రికార్డులను, టాక్స్ లకు సంబంధించిన బిల్లులను డిఎల్‌పిఓ ఎం.శ్రీనివాస్ క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న పారిశుధ్య గురించి వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు శానిటైజ్ చేయాలని పంచాయతీ కార్యదర్శి నవీన్‌కి సూచించారు

విద్యాసంస్థలు, కళాశాలల్లో ఆటంకాలు సృష్టిస్తే చర్యలు

ఏసిపి బస్వారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్/భీంగల్

డివిజన్లో గల విద్యార్థి సంఘాలకు సంఘ నాయకులు బంద్ పేరుతో విద్యాసంస్థలు, కళాశాలల్లో ఆటంకాలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బస్వారెడ్డి మంగళవారం హెచ్చరించారు. నిరసనల పేరుతో ఇంకా ఏ ఇతర కారణాల చేతగాని ప్రైవేటు, ప్రభుత్వ (స్కూల్, ఇంటర్, డిగ్రీ) కళాశాలల దగ్గరికి వెళ్లి విద్యాసంస్థల సహజ సిద్ధమైన కార్యక్రమాలకు ఉద్దేశపూర్వకంగ, అంతరాయం కలిగిస్తే విద్యార్థి సంఘ నాయకులపై కార్యకర్తలపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకొనబడునని తెలిపారు. విద్యాసంస్థలపై, లేదా యాజమాన్యాలపై ఏదైనా అభ్యంతరాలు గాని లేదా అభియోగాలు ఉన్నట్లయితే సంబంధిత జిల్లా అధికారులకు లేదా పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అంతరాయం కలిగిస్తే చట్టరిత్యమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భీంగల్:జిల్లాలోని కొన్ని విద్యార్థి సంఘాలు ప్రైవెట్ పాఠశాలలకు, కళాశాలలోకి ప్రవేశించి యాజమాన్యాలతో గొడువకు దిగి, భయభ్రాంతులకు గురి చేస్తు వారి విధులను ఆటంకం కలిగిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో కఠిన చర్యలు చేపట్టనున్నట్లు ఎస్సై హరిబాబు మంగళవారం తెలిపారు. జిల్లా పోలీస్ కమిషనరేట్ ఆదేశానుసారం విద్యార్థి సంఘాలకు విద్యకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నను వారు ముందుస్తుగా జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి లేదా జిల్లా పరిపాలన అధికారి దృష్టికి తీసుకొని వెళ్లాలని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి సామరస్యంగా కృషిచేయాలి తప్ప, స్కూళ్లకు లేదా కాలేజీలకు వెళ్లి దాడులు నిర్వహించిన, బంద్ చేయించిన, యాజమాన్యాలను భయభ్రాంతులకు గురిచేసిన అలాంటి వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తప్పవని సిపి వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు.

నేడు డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-బాల్కొండ

మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నేడు మండల కేంద్రంలో డ్రగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్టు ఎస్సై కే.గోపి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా గంజాయి, మత్తు మందు, డ్రగ్స్ రహిత సమాజం కోసం మనమందరం కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ ర్యాలీలో ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు, యువకులు పాల్గొనాలని ఎస్ఐ పేర్కొన్నారు.

సెమిస్టర్ పరీక్షల రీవాల్యుషన్‌కు షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పిజి ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు యూనివర్సిటీ పరీక్షల విభాగం రీవాల్యుయేషన్ తేదీని మంగళవారం ప్రకటించింది. 1-జూలై లోపు రీవాల్యుయేషన్ కోరిన విద్యార్థులు ఫీజు చెల్లించాలని తెలిపారు. ఒక్కో పేపర్ రివాల్యుయేషన్ ఫీజు రూ.500 చెల్లించాలని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం. అరుణ తెలిపారు.

సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షల ఫీజు తేదీప్రకటన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పిజి ఒకటవ, మూడవ, ఇంటిగ్రేటెడ్ కోర్సులు ఏడవ, తొమ్మిదవ సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షల ఫీజు తేదీని మంగళవారం ప్రకటించారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ ఒకటవ మూడో ఇంటిగ్రేటెడ్ కోర్సుల ఏడవ, తొమ్మిదవ సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షల ఫీజు 1 జూలై లోపు చెల్లించాలని, 100 రూపాయల అపరాధ రుసుంతో 4-జూలై వరకు చెల్లించవచ్చునని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం. అరుణ తెలిపారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్‌ను సంప్రదించాలన్నారు.

నివాళి అర్పించిన ఎమ్మెల్యే


నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే, పాలెపురాజు కుటుంబీకులు

నవతెలంగాణ-ఆర్మూర్

బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు తండ్రి పాలెపు చిన్నారెడ్డి ద్వాదశ దిన కర్మ మంగళవారం పెర్కిట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డి హాజరై చిన్నారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాలెపు రాజు కుటుంబ సభ్యులు బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ని కలిసిన మండల బీఆర్ఎస్ నాయకులు


మాజీ సీఎం కేసీఆర్‌తో ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డితో కలిసి మాజీ సీఎం కేసీఆర్‌ని ఆయన ఫామ్ హౌస్ లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారు పార్టీకి అందించిన సేవలను గురించి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని కేసీఆర్ అడిగితెలుసు కున్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ.. మాజీ సీఎం, ఉద్యమ నేత కేసీఆర్‌ని కలవడం ఆనందంగా ఉందని అన్నారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం, ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య,పెద్ద కాపుల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పత్తిరెడ్డి ప్రకాష్, ఎలూరి శ్రీనివాస్, నాగిరెడ్డి రాజేందర్, సోమిరెడ్డి శ్రీనివాస్, రొక్కెడ మోహన్, బాలాజీ గౌడ్, సోమ రాజేశ్వర్, ఐండ్ల చిన్నారెడ్డి ఉన్నారు.

అంగన్‌వాడీల్లో
పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభానికి చర్యలు

- రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-కామారెడ్డి

అంగన్ వాడి కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. మంగళవారం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ అంగన్ వాడి కేంద్రాల అభివృద్ధి పై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ మాట్లాడుతూ గత 5 నుంచి 6 సంవత్సరాలుగా పిల్లల సంక్షేమం కోసం కృషిచేసిన ప్రముఖమైన స్వచ్ఛంద సంస్థల సహకారంతో అంగన్ వాడి సెంటర్ల అభివృద్ధి కార్యాచరణ, పిల్లలకు నేర్పాల్సిన పాఠ్యాంశాలు, పిల్లల అభివృద్ధి తీసుకోవాల్సిన చర్యల ప్రణాళిక రూపొందించామని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని చిన్న వయసులో పిల్లలకు నేర్పాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, అంశాలు, నైపుణ్యాలతో కోర్సు సిద్ధం చేశామని, అంగన్ వాడి సెంటర్లలో పిల్లలకు నేర్పించాల్సిన అంశాలను వివరిస్తూ అంగన్ వాడి టీచర్లకు ప్రత్యేక బుక్ లెట్ రూపొందించామని, జూలై మొదటి వారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్ వాడి టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్య పై శిక్షణ పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆమె సూచించారు. ప్రతి అంగన్ వాడి సెంటర్ లో ప్లే మ్యాట్ ఏర్పాటు చేయాలని, దీనిని రాష్ట్ర స్థాయి నుంచి అందించడం జరుగుతుందని, అదే విధంగా జిల్లా స్థాయిలో సంక్షేమ శాఖ వద్ద అందుబాటులో ఉన్న నిధులతో ప్రతి అంగన్ వాడి కేంద్రంలో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా వాల్ పెయింటింగ్స్ వేయించాలని అన్నారు. అంగన్ వాడి కేంద్రాల్లో సివిల్ వర్క్స్ కోసం మంజూరు చేసిన నిధులను వినియోగించుకుంటూ ప్రతి అంగన్ వాడి కేంద్రంలో తాగు నీరు, అవసరమైన మేర టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్ మరమ్మత్తు మొదలగు పనులు పూర్తి చేయాలని అన్నారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న అంగన్ వాడి శిక్షణ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, అంగన్ వాడి కేంద్రాలలో ఉన్న పిల్లలకు ఏక రూప దుస్తులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.


పాల్గొన్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

జూలై నెలలో అంగన్ వాడి పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని, అప్పటి వరకు నిర్దేశించిన పనులు పూర్తి చేయాలని అన్నారు. చిన్నపిల్లల్లో పోషక లోపాల నివారణకు కట్టెదటమైన చర్యలు తీసుకోవాలని, ముందస్తుగా పోషక లోపం గల పిల్లలను అంగన్ వాడి టీచర్ల ద్వారా గుర్తించాలని అన్నారు. ప్రతి గ్రామం, పట్టణ ప్రాంతాల్లో ఉన్న అంగన్ వాడి టీచర్లు వారి పరిధిలో ఉన్న పిల్లల ఎదుగుదల గణనించాలని, అవసరమైన వారికి అదనపు పౌష్టికాహారం, పోషకాలు అందించాలని అన్నారు. గ్రామాలలో, పట్టణాలలో ఉన్న 1 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలను అంగన్ వాడి కేంద్రాలలో రిజిస్టర్ చేయించి వారికి రెగ్యులర్ గా పౌష్టికాహారం అందించాలని అన్నారు.

అంగన్ వాడి కేంద్రాలలో ఉన్న పిల్లల ఎదుగుదల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, వయసుకు తగిన బరువు ఎత్తు లేని పిల్లలను గుర్తించాలని, పిల్లల లో ఉన్న ఎదుగుదల, మానసిక సమస్యలను ముందస్తుగా గుర్తిస్తే వాటిని త్వరితగతిన పరిష్కరించె అవకాశం ఉంటుందని అన్నారు.



వీసీలో మాట్లాడుతున్న వాకాటి కరుణ

ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు దివ్యాంగ సర్టిఫికెట్ త్వరితగతిన అందించేందుకు సదరం క్యాంపులలో అవసరమైన మేర స్లాట్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 14567 ద్వారా జిల్లాలో ఎవరైనా వయోవృద్ధులు వారి పిల్లలు సంతానము లేదా వారసులు సరిగ్గా చూసుకోనట్లయితే, వారి సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహించినట్లయితే, వారికి అందాల్సిన కనీస అవసరాలతో పాటు జీవించే హక్కును కాలరాయడం, దుర్భాషలాడడం భౌతిక హింస ,శారీరక, మానసిక హింసలకు గురి చేసినట్లయితే వారిపై చట్టరీత్యా తగు చర్యలు జైలు శిక్ష, జరిమానా విధించడం జరుగుతుందని ఈ సందర్భంగా సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి బావయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే చేయించి ధరణి నుంచి తొలగించాలి

- రైతు నేస్తలో రైతులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పంట పండని బీడు భూములు, వెంచర్లు, రోడ్లు, శిఖం భూములు, ఇల్లు, రెవెన్యూ శాఖ వారితో సమగ్రంగా సర్వే చేయించి వాటిని ధరణి నుంచి తొలగించి వ్యవసాయ శాఖకు అందించినప్పుడే వారికి రైతు భరోసా అందజేయాలని రైతులు పేర్కొన్నారు. మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయశాఖ మంత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతు భరోసా విధి విధానాలకు సంబంధించిన రైతుల అభిప్రాయాలు సేకరించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. రైతు భరోసాను 10 ఎకరాలలోపుగల రైతులకు ఇవ్వాలని, వ్యవసాయ సాగు భూమికి మాత్రమే రైతు భరోసాను ఇవ్వాలని మరికొందరు రైతులు వివరించారు. రైతు భరోసాను సీజన్ ప్రారంభమయ్యే ముందు అందించాలని కోరారు. రైతు చిన్నచిన్న అవసరాలు నిమిత్తం బ్యాంకుల్లో లోన్ కొరకు ఐటీ రిటర్న్ ఫైల్ చేయవలసి వస్తుందని, అర్హులైన రైతుల వివరాలు బ్యాంకు ద్వారా సేకరించి వారికి కూడా రైతు భరోసా ఇవ్వాలని ఇంకొందరు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కార్యక్రమంలో డిడిఏ నిజామాబాద్ తిరుమల ప్రసాద్, ఏడిఏ ప్రదీప్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు, రాజేందర్, హీర, దీపిక, సహకార సొసైటీ చైర్మన్లు శ్రీనివాస్ రెడ్డి, రామచందర్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.


రైతునేస్తంలో పాల్గొన్న అధికారులు, రైతులు

దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్ష 2025కు కోచింగ్ తరగతులు జూలై 18 నుంచి 2025 ఏప్రిల్ 18 వరకు టీజీ బీసిస్టడీ సర్కిల్, లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్‌లో ప్రారంభమవుతాయని, అందులో 150 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనుండగా, 100 మందికి జూలై 7న నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేస్తారని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి డి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుంచి 100 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక ఈ నెల 19 నుంచి జూలై 03 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అందుకు నిజామాబాద్ జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వెబ్‌సైట్ www.tgbestudycircle.cgg.gov.in లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. మరో 50 మంది అభ్యర్థులను ఇంతకు ముందు యుపిఎస్సి వారు నిర్వహించిన సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని తీసుకొనబడునని, వారు సంబంధిత పత్రాలతో జూలై 03లోగా నేరుగా టిజి బీసీ స్టడీ సర్కిల్, లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్‌లో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు లాడ్జింగ్, భోజనం, రవాణా ప్రయోజనం కోసం నెలకు రూ.5000, బుక్ ఫండ్ నిమిత్తం ఒక్కసారి రూ.5000లను ఇవ్వబడునని గ్రంథాలయ సదుపాయం కల్పించారని తెలిపారు. ఇతర వివరాలకు ఈ ఫోన్ నెంబర్ 08462-241055ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అధికారంకోసం అర్ధరాత్రి ఎమర్జెన్సీ ప్రకటన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రధాన మంత్రి పదవి, అధికారం ఎక్కడ పోతుందోనని జూన్ 25, 1975న అర్ధరాత్రి ఎమర్జెన్సీ ప్రకటించారని మాజీ బీసీ కమిషన్ మెంబర్ తల్లోజీ ఆచారీ అన్నారు. భారతీయ జనతా పార్టీ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు అధ్యక్షతన ఎమర్జెన్సీ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ బీసీ కమిషన్ మెంబర్ తల్లోజీ అచారీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లిన పుప్పాల రాజేందర్, ఉల్పే రాజేశ్వర్, పోల ఆంజనేయులు, జలగం వెంకట్ రెడ్డి, సిలివేరి శ్రీధర్, భలసాని గోవర్ధన్, ఆర్. రవినాథ్‌కు సన్మానం చేశారు. ఈ సందర్భంగా తల్లోజీ అచారీ మాట్లాడుతూ.. 1971 ఎన్నికల్లో ఇందిరాగాంధీ ఉత్తరప్రదేశ్ లోని రాయబరేలినుంచి పోటీ చేసి గెలిచారన్నారు. ఆమెపై పోటీ చేసి ఓడిపోయిన రాజ్ నారాయణ్ ఇందిరాగాంధీ ఎన్నికలో గెలిచేందుకు పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగం పాల్పడ్డారు అని అరోపిస్తు అలహాబాద్ హైకోర్టులో కేసు వేశారని తెలిపారు. ఆ కేసును 4 సంవత్సరాలు విచారించారని, 1975 జూన్ 12 న తీర్పు రావడం తో ఎన్నికల్లో ఇందిరాగాంధీ గెలువడం కొరకు అధికారిక దుర్వినియోగం పాల్పడిందని ఆమె ఎన్నిక చెల్లదంటు, అంతే కాకుండా ఆమె 6 ఏళ్ళ పాటు ఏ ఎన్నికలో పోటీ చేయద్దు అంటు నిషేధిస్తూ తీర్పు ఇచ్చారని తెలిపారు. అప్పుడు దేశంలో ఉన్నా ప్రతిపక్ష పార్టీలు ఇందిరాగాంధీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారని అన్నారు. తన ప్రధాన మంత్రి పదవి, అధికారం ఎక్కడ పోతుందోనని జూన్ 25, 1975న అర్ధరాత్రి ఎమర్జెన్సీ ప్రకటించారని తెలిపారు. దీనివల్ల ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి దినంగా అయిందని అన్నారు. ఎమర్జెన్సీ 1975 నుంచి 1977 వరకు దాదాపుగా 21 నేలలు విధించారని తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసినా పత్రిక కార్యాలయాలకు కరెంట్‌ను కట్ చేశారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసిన జర్నలిస్టులను అరెస్టు చేసి జైల్లో పెట్టారు అని అన్నారు. ప్రభుత్వానికి ఎదురు తిరిన అందరినీ మీసా చట్టం కింద అరెస్టు చేశారని అన్నారు. కార్యక్రమంలో నాగ్గోల్ల లక్ష్మి నారాయణ. దొంతుల రవి. స్వామి యాదవ్. భారత్ భూషణ్. ఇప్పాకాయల కిషోర్. గడ్డం రాజు. విరేందర్. శీలా శ్రీనివాస్. గిరిబాబు. కూమార్. తిరుపతి రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రైవేట్ కాలేజీల్లో ఫీజుల దోపిడీని అరికట్టడానికి ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని పిడిఎస్‌యూ నాయకులు కోరారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని, ఫీజుల దోపిడీని అరికట్టడానికి ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో డిఐఇఓ కార్యాలయం ముందు నిరసన తెలిపి అనంతరం జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవి కుమార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడు తున్నాయని, తరగతులు సరిగ్గా జరగడంలేదని. త్రాగునీరు, టాయిలెట్ల సమస్య పరిష్కరించాలని, లెక్చరర్ల కొరత లేకుండా చూడాలని, ఉత్తీర్ణత పెంపొందించే విధంగా ఇప్పటినుంచి చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఫీజుల దోపిడీ విపరీతంగా పెరిగిందని. జేఈఈ, మెయిన్స్, నీట్ పేరుతో రెండు లక్షల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని, నిజామాబాద్ జిల్లాలో దోపిడీ విపరీతంగా జరుగుతుందని, వివిధ రకరకాల పేర్లతో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ ఫీజులను అరికట్టడానికి ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ నాయకులు మనోజు, నిఖిల్, రవీందర్, హనుమాన్లు, దుర్గ ప్రసాద్, తేజ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



మందులు అందజేస్తున్న వైద్యులు

నవతెలంగాణ- కామారెడ్డి

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో బిబిపేట్ మండల రెడ్ క్రాస్ వారి సహకారంతో బిబిపేట మండల కేంద్రంలో మంగళవారం మెగా ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మండల కేంద్రంలోని వాసవి క్లబ్ లో 60 సంవత్సరాలు పైబడిన వారికి ఈసీజీ, కంటి పరీక్షలు రక్త పరీక్షలు 105 మందికి చేసినట్టు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఎం.రాజన్న తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్, సెక్రెటరీ బి రఘుకుమార్, కరస్పాండెంట్ పీవీ నరసింహం, జిల్లా హెల్త్ కోఆర్డినేటర్ డాక్టర్ విక్రమ్ కుమార్, మండల చైర్మన్ బాశెట్టి నాగేశ్వర్, వైస్ చైర్మన్ స్వామి, వాసవి క్లబ్ ప్రతినిధులు యాదగిరి, శ్రీనివాస్, రాంచెంద్రం, ప్రసాద్, రాజశేఖర్, ఆంజనేయులు, ల్యాబ్ టెక్నీషియన్ సుమన్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమర్జెన్సీలో జెలుకెళ్లిన వారికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

ఎమర్జెన్సీలో జైలుకి వెళ్లిన వారిని జిల్లా కేంద్రంలోని భాజపా కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. దేశరాజ్యాంగ గౌరవానికి అంకితమైన వారికి, భారత ప్రజాస్వామ్య సాంప్రదాయాలపై విశ్వాసం ఉన్న వారికి జూన్ 25 మరపురాని రోజని అన్నారు. కాంగ్రెస్ భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, దేశాన్ని జైలుగా మార్చి, ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అణచిన ఆ చీకటి రోజులకు నేటికీ 50 సంవత్సరాలు పూర్తీ కావస్తుందని తెలిపారు. ఆ చీకటి రోజులను భారతదేశపు నవ తరం ఎన్నటికీ మరచిపోదని భాజపా నాయకులు అన్నారు.కార్యక్రమం లో ఆ నాడు జైలుకి వెళ్లిన వారు రాజుల దేవి రావినాథ్, బుసని గోవర్ధన్, పుప్పాల రాజేందర్, ఉలిష రాజేశ్వర్, చిలివేరి శ్రీధర్, ఆంజనేయులుకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య జిల్లా బీజేపి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు బెంచీల వితరణ

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి దాతలు, పూర్వ విద్యార్థులు చేయూతనందిస్తుండడం హర్షణీయమని నసురుల్లాబాద్ పీఆర్టీయు మండలాధ్యక్షుడు గునిగిరి హనుమాన్లు తెలిపారు. మంగళవారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు బెంచీలను సినీ నిర్మాత కానూరి శ్రీనివాస్ 15 డెస్క్ బెంచ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా సినీ నిర్మాత తండ్రి సత్యనారాయణ మాట్లాడుతూ.. పాఠశాలలో మౌలిక వసతుల కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చందర్, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



బెంచీలు అందజేస్తున్న నిర్మాత శ్రీనివాస్

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలో తగ్గెల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం డీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్ఎం దాసరి ధన్‌రాజ్ విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి దాసరి శౌరిరాయలు జ్ఞాపకార్థం స్థాపించిన డీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో 75 మంది విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మెన్ లక్ష్మీ ఉపాధ్యాయులు హన్మండ్లు, శశికళ, నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



పంపిణీ చేసిన ప్లేట్లతో విద్యార్థులు

గుట్టలను తవ్వేస్తున్న మాఫియా

- కనుమరుగవుతున్న వృక్ష సంపద
- అధికారుల కనుసైగల్లోనే..

నవతెలంగాణ-(బాన్సువాడ)నసురుల్లాబాద్

బాన్సువాడ మండల కేంద్రంలో మొరం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. సెలవు దినాలతో పాటు రాత్రి వేళల్లోనూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మొరం తరలిస్తూ లక్షలాది రూపాయలను ఆర్జిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. బాన్సువాడ మండల కేంద్రం, బీర్కూర్, నసురుల్లాబాద్, ఆయా గ్రామాల శివారులో జేసీబీలతో మొరం తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా వెంచర్లకు, ఇండ్ల బరంతీలకు తరలిస్తున్నారు. ఇటీవల రెవెన్యూ అధికారుల సూచనల మేరకు కొల్లూర్ శివారు టిప్పర్లను అడ్డుకున్న గ్రామ సేవకులను మొరం మాఫియా బెదిరింపులకు గురి చేయడం చర్చనీయాంశంగా మారింది. మొరం మాఫియాతో రియల్ఎస్టేట్ వ్యాపారులు సైతం లాభపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

బాన్సువాడ మండలంలో అనుమతులు లేకుండా సాగుతున్న మొరం, ఇసుక వ్యాపారంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నది. మొరం, ఇసుక వ్యాపారం చేయాలంటే మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకొని రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇవ్వాలనే నిబంధన ఉన్నది. కానీ బాన్సువాడ మండలంలో నిబంధనలను తుంగలో తొక్కి దర్జాగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

కనుమరుగవుతున్న వనరులు, వృక్ష సంపద..

మొరం మాఫియా ఆగడాలు మితిమీరడంతో వనరులు, వృక్ష సంపద కనుమరుగవుతున్నది. బాన్సువాడ మండలంలోని ఆయా గ్రామాల్లో గుట్టల ప్రాంతాల్లో పెద్ద పెద్ద చెట్లను జేసీబీలతో పెకిలించి మరీ మొరం తవ్వకాలు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కోట్లాది రూపాయలను వెచ్చించి హరితహారంలో భాగంగా ఒక పక్క మొక్కలను నాటుతుంటే మొరం మాఫియా ధనార్జనే ధ్యేయంగా గుట్టలను, వృక్ష సంపదను నాశనం చేస్తున్నది. బాన్సువాడ మండలంలోని కొల్లూరు, నాగారం, బుడిమి, కొత్తబాది, బోర్లం, తదితర గ్రామాల్లో గుట్టల ప్రాంతాల్లో పెద్ద పెద్ద వృక్షాలున్నాయి.



మిషన్ ద్వార తవ్వుతూ మొరం టిప్పర్లలో లోడింగ్



తవ్విన గుట్టలు

మొరం మాఫియాకు అధికారుల అండ..?

బాన్సువాడ మండలంలో రోజురోజుకు మొరం మాఫియా ఆగడాలు మితిమీరిపోతుండడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు సైతం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల కొల్లూరు, బుడ్మి శివారులో మొరం టిప్పర్లను అడ్డుకున్న గ్రామ సేవకులను మాఫియా బెదిరింపులకు గురిచేసినట్లు సమాచారం. ప్రభుత్వ అనుమతులు లేకుండా మొరం రవాణా చేసే మాఫియాపై అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. మండలంలోని కొల్లూరు శివారు నుంచి మొరం తరలిస్తున్న 8 టిప్పర్లు, నాలుగు పొక్లెయిన్‌లతో మొరం అక్రమ రవాణా చేస్తున్నారు.

మొరం అక్రమ రవాణాను అడ్డుకుంటాం

బాన్సువాడ మండలంలో అనుమతి లేకుండా సాగుతున్న మొరం దందాను రెవెన్యూ అధికారులు సహకారం తీసుకుంటే అక్రమ రవాణాలను అడ్డుకుంటాం. ప్రతి రోజు తమ సిబ్బందితో పెట్రోలింగ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తున్నాం. మొరం, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకొని చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల అనుమతులతో అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

- కృష్ణ సీఐ బాన్సువాడటౌన్

మొరం దందాపై ప్రత్యేక నిఘా

అనుమతులు లేకుండా సాగుతున్న మొరం దందాపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశాం. నూతన గృహ అవసరాలకు కావలసినవారు దరఖాస్తు చేసుకోవాలి. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో మొరం అక్రమ రవాణా చేసే వారిపై ఫిర్యాదులు వస్తే వాహనాలను సీజ్ చేస్తాం. ఇందుకు పోలీసు శాఖ సహకారం తీసుకుంటాం. అక్రమంగా మొరం వ్యాపారం చేస్తున్న వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

- వరప్రసాద్, తహసీల్దార్, బాన్సువాడ

ఈ నెల 27న వేలం పాట

నవతెలంగాణ-పిట్లం

2024-25 సంవత్సరానికి గానూ మండల కేంద్ర గ్రామపంచాయతీ తై బజార్ వేలం పాటను ఈ నెల 27న గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి కమలాకర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు సెక్రటరీ యాదగిరి మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలంపాటలో పాల్గొనాలనుకున్న వారు రెండు లక్షలు డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు. వేలంపాట దక్కించుకున్న వారు జులై 1 నుంచి 31 మార్చ్ వరకు గడువు ఉంటుందని పేర్కొన్నారు.

చెరువులో మొరం తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న మత్స్యకార్మికులు

నవతెలంగాణ-దోమకొండ

మండలంలోని ముత్యంపేట గ్రామ చెరువులో అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ మత్స్య కార్మికుల సంఘం అధ్యక్షులు స్వామి ఆధ్వర్యంలో ఇంచార్జ్ తహసీల్దార్ రేఖకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముత్యంపేట గ్రామంలోని చెరువులోని నుండి గత కొన్ని రోజులుగా ఎలాంటి అనుమతి లేకుండా ఓ కాంట్రాక్టర్ మొరం తరలిస్తున్నారని తెలిపారు. చెరువులో ప్రమాదకర స్థాయిలో దాదాపు 7 మీటర్లకుపైన లోతు తవ్వకాలు చేపడుతున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో చెరువులో ప్రమాదకర స్థాయిలో లోతుగా తవ్వకాలు చేపట్టడంతో మత్స్య కార్మికులు మరణించారని తెలిపారు. అధికారులు స్పందించి చెరువు తవ్వకాలను నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం సభ్యులు నర్సయ్య, లింగం, రవి, రాజు, నర్సింలు తదితరులున్నారు.

జింకల బెడద ఆందోళనలో రైతులు



పంటచేనుల్లో సంచరిస్తున్న జింకలు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని శివారు ప్రాంతంలో జింకల బెడద ఉండడంతో వానాకాలం పంట సాగు మొలకెత్తిన పంటలను జింకలు నష్టం కలిగించడంతో వ్యవసాయ రైతులు ఆందోళనలతో తలలు పట్టుకుంటున్నారు. వేలాది రూపాయల విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సాగు చేసిన పంటలు మొలకెత్తగానే జింకలకు మేతగా మారడంతో రైతులు నష్టపోతున్నారు. జింకల మందలను కాపల కాయడానికి రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. వందల సంఖ్యలో జింకల మందలుగా ఉన్నాయి. ఏ చేనులో పడ్డ ఆ చేను పంట పూర్తిగా నష్టానికి గురవుతోంది. జింకల మందలను ఫారెస్ట్ శాఖ అధికారులు అరికట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

మండుతున్న ఎండలు

- ఆకాశం వైపు రైతన్నలు ఎదురుచూపు

నవతెలంగాణ-మద్నూర్

ప్రతి ఏడాది వానాకాలం పంట సాగు జూన్ మొదటి వారంలో ప్రారంభమవుతాయి. కానీ ఈ యేడాది రెండు వారాలపాటు ముఖం చాటేసిన వాన.. తర్వాత అడుపాదడపా చిరుజల్లులు కురియడంతో మండల రైతులు పంటల సాగును పూర్తి చేశారు. వేలాది రూపాయలు ఖర్చుపెట్టి విత్తనాలు చల్లారు. అందులో భాగంగా అడుగు ఎరువును సైతం వేశారు. అయితే సరైన సమయంలో వర్షం పడటం లేక రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలం లాగే ఎండలు మండటంతో మొలకెత్తిన పంటలు మాడిపోతాయని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకటి రెండు రోజుల్లో వర్షాలు పడకపోతే సాగుచేసిన వానాకాలం పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాత్రివేళలో రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయం

- ఆదర్శంగా నిలిచిన రక్తదాత అంజల్ రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో దోమకొండ మండల కేంద్రానికి చెందిన దీకొండ రామచంద్రం(72) రక్తహీనతతో బాధపడుతుండడంతో వైద్యులు ఓ పాజిటివ్ రక్తం కావాలని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కుటుంబ సభ్యులు ఐవీఎఫ్ సేవాదల రాష్ట్ర చైర్మన్ రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలుని సంప్రదించడంతో గాంధారి మండలం జువ్వాడి గ్రామానికి చెందిన టీఎస్ఎస్ఎఫ్ జహీరాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు అంజల్‌రెడ్డి వెంటనే స్పందించి రక్తం అందజేశారు. కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్, ఉపాధ్యక్షుడు జమీల్ క్రాంతికుమార్, టెక్నీషియన్లు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉండాలి

- పోచారం చేరికను స్వాగతిస్తున్నాం
- మాజీ జడ్పీటీసీ నార్ల రత్నకుమార్

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీలోకి సంతోషంగా స్వాగతిస్తున్నామని బాన్సువాడ కాంగ్రెస్ సీనియర్ నేత, బాన్సువాడ మాజీ జెడ్పీటీసి నార్ల రతన కుమార్ తెలిపారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అందరితో చర్చించి జిల్లా నాయకులకు ముందుగా తెలియపర్చిన తర్వాతనే మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించినట్లు చెప్పారు. వారి రాకవల్ల జిల్లాలో బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందన్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి గతంలో కాంగ్రెస్‌లో పని చేసిన వ్యక్తిని అలాగే తెలుగుదేశం పార్టీలోనూ బీఆర్ఎస్ పార్టీలోనూ రాష్ట్ర మంత్రులుగాను, స్పీకర్ గాను పనిచేసిన అనుభవం ఉందన్నారు. రాష్ట్రంలో మాజీ మంత్రిగా, ఎమ్మెల్యేగా సాగుతున్నారని వారికి కాంగ్రెస్ పార్టీ కొత్తకాదని ఆయన పేర్కొన్నారు. అందరం కలసికట్టుగా ఉండి జిల్లాను, బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధిబాటలో తీసుకువెళ్లడానికి కృషి చేసేందుకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న నార్ల రత్నకుమార్

బాన్సువాడ నియోజకవర్గంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నవారు ఎవరైనా పార్టీలోకి రావచ్చునని ఆయన పిలుపునిచ్చారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడ నియోజకవర్గంలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలను నాయకులను కలిసి వారికి మనోధైర్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన సూచించారు. నాయకులను కార్యకర్తలను అండగా ఉంటూ పార్టీని బలోపేతం చేసేందుకు పోచారం కృషి చేయాలన్నారు. వీరి వెంట బాన్సువాడ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్లో భోజనం తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జడ్పీటీసీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల ఎస్సీ హాస్టల్లో మంగళవారం ఉదయం జెడ్పీటీసి సభ్యుడు మనోహర్ రెడ్డి భోజనాన్ని తనిఖీ చేశారు ఈ సందర్భంగా భోజనం రుచికరంగా వండుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టించాలని హాస్టల్ వార్డెన్ రామును ఆదేశించారు.

ఈవీఎం గోదాంలను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి ఎస్పి కార్యాలయ సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సందర్శించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 276, కామారెడ్డి నియోజకవర్గంలోని 274, జుక్కల్ నియోజకవర్గంలోని 262 మొత్తం 812 వివి ప్యాట్ల నుంచి థర్మల్ పేపర్ రోల్స్, అడ్రస్ ట్యాగుల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఈవీఎం గోదాంకు తాళం వేసి సీజ్ చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి ఆర్డీఓ రంగనాథరావు, ఎన్నికల విభాగం అధికారులు ప్రేమ్‌కుమార్, అనిల్ కుమార్, తహసీల్దార్ జనార్ధన్, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల అధికారులు పాల్గొన్నారు.



పాఠశాలల్లో పనులు పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పెద్దగుల్లాలోని తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాలలను ఎంపిడివో శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడివో శ్రీనివాస్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తాగునీరు, కొత్తగా ఏర్పాటు చేస్తున్న సింక్‌లను, మరుగుదొడ్లు, వాష్‌రూం, టాయిలెట్లను పరిశీలించి కొన్ని మార్పులు చేయాలని తెలిపారు. పనులు నాణ్యతగా గుత్తేదారునితో దగ్గరుండి చేయించుకోవాలని హెచ్ఎంలను ఆదేశించారు. సమయ పాలన పాటించాలని, లేకుంటే శాఖపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి, ఉర్దూ హెచ్ఎం సమీనా భేగం, తెలుగు మీడియం ఇన్‌చార్జీ హెచ్ఎం మనీషా, ఉపాధ్యాయులు మౌనిక, తరన్నుమ్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాలను సకాలంలో చెల్లించాలి

- డిపిఎం సంధ్యారాణి

నవతెలంగాణ-రెంజల్

బ్యాంకు లింకేజీ శ్రీనిధి రుణాల టార్గెట్‌ను నెలవారీగా పూర్తి చేయాలని డిపిఎం సంధ్యారాణి సీఏలను ఆదేశించారు. మంగళవారం ఐకెపి కార్యాలయంలో సీసీలకు, సీఏలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సిఐలు, డ్వాక్రా గ్రూప్ మహిళలకు రుణాల రికవరీల అవగాహన కల్పించడమే కాకుండా టార్గెట్‌ను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా శక్తిపై కూడా వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం చిన్నయ్య, సీసీలు భాస్కర్, శ్యామల, శివకుమార్, కృష్ణ, రాజయ్య, సునీత, కంప్యూటర్ ఆపరేటర్, మండలంలోని సీఏలు వీవోఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఎం సంధ్యారాణి

ఘనంగా ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘం 74వ వార్షికోత్సవం

నవతెలంగాణ-బోధన్

ఏఐఎస్‌బీ విద్యార్థి సంగం 74వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం పట్టణంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో జిల్లా అధ్యక్షులు నాగరాజ్ విద్యార్థి సంఘం జెండా ఎగురవేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలు, ప్రైవేటీ కరణపై, విదేశీ యూనివర్సిటీలకు వ్యతిరేకంగా, స్కాలర్‌షిప్స్ మంజూరికై ఏఐఎస్‌బీ పోరాటం చేస్తుం దన్నారు. కార్యక్రమంలో బోధన్ డివిజన్ విద్యార్థి సంఘ నాయకులు రాజన్న, గంగ ప్రసాద్, శీను, అన్వేష్, లక్ష్మణ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్యానికి చీకటి రోజు ఎప్పటికీ మర్చిపోము

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజాస్వామ్యానికి చీకటి రోజు ఎప్పటికీ మర్చిపోలేమని బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. భారతదేశంలో ఎమర్జెన్సీ అనేది 1975 నుంచి 1977 వరకు 21 నెలల వ్యవధిలో ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ దేశానికి అంతర్గత, బాహ్య బెదిరింపులను ఉదహరిస్తూ దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. జూన్ 25 నాటికి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జూన్25 ప్రజాస్వామ్యానికి చీకటి రోజు పేరిట బీజేపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం మంగళవారం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నల్ల రిబ్బన్‌లతో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వీరులను, ఉద్యమకారులను స్మరించుకున్నారు. 1977 మార్చి 21వరకు ఇందిరాగాంధీ రాజకీయ ప్రత్యర్థులను జైలుపాలు చేసి ప్రతికలను సెన్సార్ చేశారన్నారు. వాస్తవాలను చెప్పేందుకు ప్రయత్నించిన పత్రికలపై తీవ్ర నిర్బంధం విధించారని, ప్రశ్నించే మేధావులు, పాత్రికేయుల గొంతునొక్కారని, ఎన్నో సంస్థలను రద్దు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్, ప్రధాన కార్యదర్శిలు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, నాయకులు భరత్, శ్రీకాంత్, చారి, లక్ష్మరెడ్డి, శ్రీనివాస్, రవీందర్, వెంకట్, గంగారెడ్డి, రాజు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.